# వర్షం

రచన :
శ్రీ ద్విభాష్యం రాజేశ్వరరావు.

రెండేళ్ళ క్రితం వరకూ...నాకు వర్షం అంటే చాలా ఇష్టం! స్వాతి వానకోసం కాక పోయినా, ఏదో ఒక వానకోసం ముత్యపు చిప్పలా ఎదురు చూసేవాణ్ణి! కుంభవృష్టిగా వర్షం కురుస్తూంటే, తలుపులన్నీ బిగించి గదిలో కూర్చుని హాయిగా బర్కిలీ సిగరెట్లు కాలుస్తు, కథలు వ్రాయటం నాకు దాదాపు హాబీలాంటిది! తలుపులన్నీ బిగించి కూర్చున్నపుడు బయట వర్షం కురిస్తేనేం, ఎండకాస్తేనేం; అని మీరడగొచ్చు. తలుపులు బిగించినా, బయటనుంచి సన్నగా విన్పించే వర్షపు హోరు వింటూంటే నాకు అదోరకమైన వింత ఆనందం. ఆ ఆనందంలో మనసుకు తృప్తి! ఇప్పుడు వర్షం పడుతూవుండే ఆనాటి దృశ్యమే నా కళ్లకు కనబడుతూ నా స్వార్థాన్ని, పాపాన్ని, కుటిలత్వాన్ని పశుత్వాన్ని వెక్కిరిస్తూ వుంటుంది! ఆవర్షపు హోరు ఎవరో బాధగా మూల్గుతున్నట్టు, రాక్షసి ప్రసవవేదననుభవిస్తున్నట్టు కొన్ని కోట్ల గొంతుకలు వెక్కి వెక్కి ఏడుస్తున్నట్టు, ఆ కన్నీరే వర్షం కురుస్తున్నట్టు ఫీలవుతాను!

రెండేళ్ళ క్రితం ఆరాత్రి!

కాటుకలా నల్లటిమబ్బులు పట్టిన రాత్రి చెట్లను నేలగూన్చేలా ప్రచండవేగంతో గాలి వీచిన రాత్రి, ఏనుగు తొండల్లాంటి ధారలతో వర్షంకురిసిన రాత్రి, నాలోని పాపమంతా మేల్కొని నృత్యం చేసిన రాత్రి ఆరాత్రి! ఇంకా నాకు బాగా జ్ఞాపకం!

గది తలుపులు బిగించి, కుర్చీలో కూర్చొని కాళ్ళు టేబిల్ మీద పెట్టి, బర్కిలీ సిగరెట్లు 'అగ్గిపుల్లల్ని ఖర్చు చెయ్యకుండా' కాలుస్తూ హుషారుగా రాచకొండ విశ్వనాథశాస్త్రిగారి 'మంచిచెడ్డల్లో ఏ కథ' చదవటం పూర్తిచేసి ఆలోచనలో పడ్డాను!

ఆ కథలో 'మంచి', 'చెడ్డ' రెండు కథలున్నాయి! 'ఆ రెండు కథలో వీదంటే మీకు ఎక్కువ ఇష్టమో చెప్తే మీ స్వభావం కొంత వరకూ వెల్లడవుతుందని నా అభిప్రాయం' అంటూ ఆ కథ ఆఖరిలో రచయిత ఒక చిన్న ఆత్మపరీక్ష పెట్టారు! ఎంతసేపు యోచించినా రెండిటిలో ఏది ఇష్టమో తేల్చుకోలేక పోయాను. కాని ఇప్పుడు అనిపిస్తోంది, ఆ రెండు కథలోనూ 'చెడ్డ'కథనే ఎక్కువ ఇష్టపడ్డానని!

ఆ ఆత్మ పరీక్షా సమయంలో తలుపుచప్పుడయింది? పుస్తకం టేబులుమీద పడేసి వెళ్లి తలుపు తీశాను! బయటనుంచి వర్షపుజల్లు నా మొహాన్నికొట్టి గిలిగింతలు పెట్టింది. ఆయాసపడుతూ, సాంతం తడిసిపోయి ముద్దయిన ఆకారం; జగన్నాథం, గదిలోకి వచ్చేశాడు. తలుపు దగ్గరగా చేరవేసి లోపలికివచ్చాను!

జగన్నాథం నాతోటి గుమాస్తా! మీరు వాణ్ణి ఒక్క సారి చూస్తే 'వీడు గుమాస్తా వెధవ!' అని చెప్పేస్తారు! ప్రపంచంలోగుమాస్తాలుపడే బాధలన్నీ వాడి ముఖంలో గూడు

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

కట్టుకొని బయటకు తొంగిచూస్తూ వుంటాయి! వర్షాకాలంలో కూడా, ఎండలో వాడిపోయిన తోటకూరలా వుంటాడు! అస్థిపంజరానికి బిగించి అతికించినట్లుండే చర్మం, వాతుకుపోయి వెతికి తేనేకాని కన్పించని కళ్ళు; చూడటానికి చాలా బాధగా వుంటాడు! అతని ముఖంలో మంచితనం కొట్టొచ్చినట్టు కనబడకపోయినా జగన్నాథం చాలా మంచివాడు. 'వాడిమంచితనం, నిజాయితీ వాణ్ణి ఈ దారిద్ర్యవస్థకు తీసుకొచ్చాయ్! లేకపోతే వాడి ఖర్మేమిటి? నెలకు సులువుగా పైన యాభయి రూపాయిలు దొరుకుతాయి.' అని కొందరంటే 'వాడిమంచి తనమే వాణ్ణి బ్రతికిస్తోందని'కొంతమందంటారు!

'ఏమిటోయ్! ఇంత వర్షంలో ఇలా వచ్చావ్!' అంటూ వాడివైపు చూశాను. మనిషి దీనంగా వున్నాడు.

'రాజూ! ఒక్క యాభయిరూపాయలుంటే అర్జెంటుగా కావాలి! ఎలాగైనా నువ్వే సర్దాలి! నీమేలు మరచిపోలేను!' ఉద్వేగంతో అన్నాడు.

నాకు కొంచెం ఆశ్చర్యం కల్గినమాట వాస్తవం!

'ఇంత రాత్రి వేళ ఒక్కసారే యాభై రూపాయిల అవుసరం ఏ మొచ్చిందా!' అనుకున్నా!

నేను రామారావువద్ద చేసిన చేబదుళ్ళు పాపంలా పెరిగి రూపాయల యాభయి వరకూ అయ్యాయి! అవి తీర్చటంకోసం ఇంటివద్ద నుంచి ఆరోజే యాభయిరూపాయి తెప్పించాను. ఆడబ్బు ఇంకా జేబులోనే వుంది! అవి జగన్నాధడికి స్తే? ఉహు! రామారావు వారం రోజులనుండే మండిపడుతున్నాడు. అంత రాత్మ జగన్నాథానికి సాయం చెయ్యడానికి ఒవ్పుకోలేదు.

'సారీ! నావద్ద అయిదురూపాయిలుకన్న ఎక్కువలేవు! అంతడబ్బు ఒకేసారి ఎలా వస్తుంది! నేనూ నీలాగ గుమాస్తా వెధవనేగా!' నిలువునా అబద్ధం ఆడుతూ వెధవ నవ్వు ముఖానికి పూనుకున్నా.

'నీ దగ్గర వుంటుందని గంపెడాశతో వచ్చాను! సరే! ఏం చేస్తాం! మరోచోట ప్రయత్నిస్తా!' అంటూ తలుపు తీసుకొని తొందరగా వర్షంలోకి వెళ్ళిపోయాడు. అంతా రెండునిమిషాలలో జరిగిపోయింది.

రాత్రంతా వర్షం కురుస్తూనే వుంది.

వర్షం కురిసిన రాత్రి తెల్లవారింది,

వర్షపు వేగం తగ్గినా సన్నగా చినుకులు పడటం మానలేదు!

తృప్తిగా క్యారియరు భోజనం ముగించి ఆఫీసుకు బయలుదేరాను. రోడ్డంతా బురదగా వుంది. వర్షపునీరు సన్నగా కాలువలు కట్టి రోడ్డుప్రక్కన ప్రవహిస్తోంది.

పెద్దదవబోయే వర్షాన్ని సూచిస్తూ మబ్బులు బాగా ముసురుకొంటున్నాయి.

ఆఫీసుకు వెళ్ళే దారిలోనే జగన్నాథం ఇల్లు! అరుగుమీద కూర్చొని శూన్యంలోకి చూస్తున్నాడు జగన్నాథం! మనిషి దిగులుగా వున్నాడు!

ఇంట్లో అడుగు పెట్టాను. 'ఏం జగన్నాథం! అలా కూర్చున్నావ్!' అంటూ, నన్ను చూడగానే మళ్ళీ జగన్నాథం కంట్లో నీళ్ళు చిప్పిల్లాయి.

'కూర్చోక ఏంచెయ్యమంటావ్! నేను అసమర్థుణ్ణి! దరిద్రుణ్ణి! లోకంలో ఎందుకూ పనికిరానివాణ్ణి! నాలాటివాణ్ణి భగవంతుడు ఎందుకు పుట్టించడం! లోకంలో గుమాస్తాలందరూ కలిసి దేముడిమీద తిరగబడితే బాగుంటుంది! మూడు రోజులనుంచీ నా భార్యకు జ్వరం! నిన్నరాత్రి మరీ విషమించింది. డాక్టరు నీరు కార్చేసి విశాఖపట్నం పెద్ద హాస్పిటల్‌కు తీసుకుపొమ్మన్నాడు! నా దగ్గర చిల్లిగవ్వ లేదు! ఎక్కడా యాభయి రూపాయలు అప్పుకూడా దొరక లేదు! ఇంక అప్పు చెయ్యనవసరం లేదు లే! దాన్ని వైజాగు తీసికెళ్ళనక్కర లేదు! మందు అవసరం లేదు! పిడికెడు బుగ్గిచేస్తే చాలు! నా భార్య! నా దారిద్ర్యానికి, అసమర్థతకు బలియైన భార్య! లోపల వుంది చూడు!'

విచిత్రంగా నవ్వుతున్నాడు జగన్నాథం! అలా నవ్వుతూవుండేవాడిలోంచి ఏదో భూతం వచ్చి నా జుట్టు పట్టుకొని పీకుతున్నట్టుంది! నా గుండెల్లో దడ, కాళ్ళలో వణుకు ప్రారంభమయ్యాయి!

కథాంజలి
[కథల మాస పత్రిక]
స్థాపితము 1938
విడి ప్రతి. ... 25 పై.
సంవత్సర చందా. ... రూ 4-00
(ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గిన్ బాతమ్స్, మరియు
స్వదేశమిత్రన్ బుక్‌స్టాల్స్‌లోనూ
దొరుకుతుంది.

'నిన్నరాత్రి జగన్నాధానికి డబ్బు ఇచ్చి వుంటే!' మరి ఆలోచించ లేకపోయాను.

జేబులోని నోట్లు గొంగళీల్లా మారి నా ఒంటిమీద ప్రాకుతున్నట్లనిపించింది.

'ఈ డబ్బు వుంచు! తరువాత పనులకు పనికివస్తాయ్!' అంటూ నా జేబులోని పురుగుల్లాటి నోట్లను వాడిమీద విదిల్చాను!

బయట వర్షంతోపాటూ మనసులోని బాధాగ్ని హెచ్చువుతోంది. నా స్వార్థాన్ని, పాపాన్ని, కుటిలత్వాన్ని ఈ వర్షం కడగ లేదు! వర్షపు హోరులో ఎవరో ఏడుస్తున్నట్లుంది!

